క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న జానకిరామన్, తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్: పేదలకు అన్నదానం చేయడం అత్యంత పుణ్యదాయకం అని కడపకు చెరందిన తోట జానకిరామన్, తోట వినీల దంపతులు తెలిపారు. తండ్రి రాజశేఖరన్ వర్ధంతి సందర్భంగా జానకీరామన్ స్థానిక బృంద వృద్ధాశ్రమంలో శుక్రవారం అన్నదానం చేశారు.

పర్యాటక అభివృద్ధికి నిధుల విడుదల

కడప కల్చరల్: జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రం గండికోట అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు అన్నారు. నిధుల విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా నిధులు తీసుకొచ్చి పనులను ప్రారంభించాలని ఆయన కోరారు.

70 ఏళ్లు పైబడిన వారికి ఉచిత వైద్యం

కడప రూరల్: ఆయుష్మాన్ భారత్ కార్డు ద్వారా 70 ఏళ్లు పైబడిన వారికి ఉచిత వైద్యం అందించేందుకు వెంటనే ఈ-కేవైసీ పూర్తిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారు 1,60,292 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఈకేవైసీ ప్రక్రియ ప్రారంభమైందని, త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్డుతో దేశ వ్యాప్తంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం పొందవచ్చన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం



నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్న హిమవర్షిణి ఫౌండేషన్ సభ్యులు

కడప అర్బన్: హిమవర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప నగరంలోని ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు అన్నదానం చేశారు. శంకరాపురానికి చెందిన కడిమెళ్ల రాణాప్రతాప్, సుధారాణిల కుమారుడు ఆదిత్యారాణా జన్మదినం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి, రెడ్డి లక్ష్మణ్, పుట్టా పురుషోత్తం, దామోదర్, ఆశ్రమ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో కాత్యాయిని



కూరగాయలతో అమ్మవారికి అలంకరణ

కడప కల్చరల్ : స్థానిక రవీంద్ర నగర్ రామాంజనేయ స్వామి ఆలయంలో కాత్యాయిని మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. కార్తిక మాసం చివరి శుక్రవారం రోజున 35 రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో శాకంబరిగా అలంకరించారు. అనంతరం లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, షోడశోపచార పూజలు, దశవిధ హారతులు, తదితర పూజలు నిర్వహించారు. అర్చకులు రామకృష్ణశర్మ, శ్రీరామ భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై ఉక్కుపాదం

సిద్దవటం : అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లో బెల్ట్‌షాపులను ఏర్పాటు చేస్తే అటివారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ హెచ్చరించారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇది వరకే ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. పలు గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్నట్టు సమాచారం అందిందని, దీంతో గ్రామాలలో నిఘా ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కమలాపురం: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ఆధ్వర్యంలో జాబ్ మేళా ఏర్పాటు చేశారు. ఈ మేళాకు ఏబీఎల్ డిక్సన్ టెక్నాలజీస్‌తో పాటు మరి కొన్ని సంస్థలు వచ్చాయి. అయితే కేవలం ఇదే కళాశాలకు చెందిన ఈసీఈ విభాగానికి చెందిన 9 మంది విద్యార్థులు, ట్రిపుల్ ఈ విభాగానికి చెందిన 5 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి డిక్సన్ టెక్నాలజీస్‌లోని ఉద్యోగ అవకాశాలు పొందారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. రామకృష్ణారెడ్డి, అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దంత రోగం.. తక్షణ ఉపశమనం

రుచికరంగా ఉంది కదా.. అని రోజూ ఏదో ఒకటి తినేస్తుంటారు. దంతాలు శుభ్రం చేసుకోకుండా హడావిడి కొనసాగిస్తారు. దీంతో దంతాలకు సమస్య వచ్చి పడుతుంది. పళ్లు పుచ్చుపట్టినా, నొప్పి కలిగినా డాక్టర్‌ను ఆశ్రయిస్తారు. రూట్ కెనాల్ చికిత్స విలువతో కూడినది కావడంతో కొందరు వెనుకడుగు వేస్తారు. ఇపుడు ఆ అవసరం లేదు. ప్రభుత్వ వైద్య శాలలో ఎమర్జెన్సీ డెంటల్ క్లినిక్ అందుబాటులోకి వచ్చింది.



కడప సర్వజన ఆస్పత్రిలోని దంత వైద్యశాల



దంత వైద్య శాలలోని చికిత్స గది

- ఎమర్జెన్సీ డెంటల్ క్లినిక్‌లో సకాలంలో వైద్యం
- రోజూ 10 – 15 మందికి రూట్ కెనాల్ పరీక్షలు

కడప అర్బన్: జిల్లాలో ప్రభుత్వ దంత వైద్య కళాశాల ప్రారంభించినా.. కడప నగర శివారులోని సర్వజన ఆసుపత్రిలోని క్యాజువాలిటీ ద్వారా సకాలంలో సేవలందేవి కావు. రూట్ కెనాల్ సేవలకు మూడు నుంచి ఆరు నెలల వ్యవధి వరకు ఎదురు చూడాల్సి వచ్చేది. అయితే ఇపుడు ఆ సమస్య లేదని వైద్యులు చెబుతున్నారు. దంత రోగులకు రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర సేవలందించేలా ఎమర్జెన్సీ డెంటల్ క్లినిక్‌ను ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ విభాగం కో ఆర్డినేటర్ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి రోజూ 10- 15 మందికి రూట్ కెనాల్ పరీక్షతోపాటు, అవసరమైన ఇతర సేవలు అందిస్తున్నారు. ఆయనతోపాటు డాక్టర్ దాశరథి, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ దీపిక, డాక్టర్ కరిష్మా బృందం వైద్య సేవలందిస్తున్నారు.

అధునాతన పరికరాలు

ఈ విభాగంలో వైద్య సేవలందించేందుకు రూ. 12.50 లక్షల విలువైన ఐదు డెంటల్ చైర్స్, ఎక్స్‌రే రేడియో విజియోగ్రామ్(ఆర్‌విజి) పరికరాలు ఏర్పాటు చేశారు. గతంలో దంత రోగులు వెళ్లిన వైద్య సేవలకు కన్జర్వేటివ్ డెంటిస్ట్, ఎండోడాంటిక్స్ విభాగాల్లో రోజుల తరబడి వేచి యుండాల్సిందే. విడతల వారీగా తీసుకున్న తరువాత రూట్ కెనాల్‌కు సమయం పట్టేది. ఇపుడు సమయం వృథా కాకుండా అధునాతన పరికరాల ద్వారా వెంటనే దంతవైద్య సేవలందిస్తున్నారు. ప్రమాదాలలో గాయపడిన వారికి, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ విభాగం ఎంతో ఉపయోగపడుతోంది.

సత్వరమే వైద్య సేవలు



నేను దంత వ్యాధితో బాధపడుతున్నా. ఆసుపత్రికి రాగానే వైద్య పరీక్షలు చేసి రూట్ కెనాల్ చికిత్స చేశారు. ప్రస్తుతం దంత నొప్పి నుంచి ఉపశమనం కలిగింది. చికిత్స చేయగానే దంతాలు ఆరోగ్యంగా వుంటాయని వైద్యులు తెలిపారు. – ఎం.ప్రశాంత్, కడప

రూట్ కెనాల్ చేయించుకున్నా



నేను దవడ వాపుతో బాధపడుతూ రిమ్స్‌లోని డెంటల్ ఆసుపత్రికి వచ్చాను. వచ్చిన తరువాత వైద్యులు పరీక్ష చేశారు. ఎక్స్‌రే తీయించారు. తరువాత రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్‌ను ప్రారంభించారు. ప్రస్తుతానికి ట్రీట్‌మెంట్ జరుగుతోంది. – వంశీ, చిట్వేలి, అన్నమయ్య జిల్లా

క్లినిక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



కడప ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఎమర్జెన్సీ డెంటల్ క్లినిక్ సేవల విభాగాన్ని ఆరంభించాం. దంత రోగులకు చికిత్సచేసి వెంటనే ఉపశమనం కలిగించడం, రూట్ కెనాల్ సేవలను త్వరితగతిన అందించడం జరుగుతోంది. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్ జ్యోత్స్న, ప్రిన్సిపల్, ప్రభుత్వ దంత వైద్య కళాశాల

దళితుల ఇళ్లను కూల్చడం దారుణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బద్వేల్‌లో దళితుల ఇళ్లు కూల్చివేయడం దారుణమని, వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మునెయ్య డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బద్వేల్‌లోని ఐలమ్మ కాలనీలో బల్లి ఓబయ్య, దొడ్డగాల గంగయ్య 16 ఏళ్లుగా నివాసముంటూ, మున్సిపాలిటీ పన్ను కడుతున్నారన్నారు. అయితే గత రెండు నెలలుగా సయ్యద్ గుల్‌ఫర్, షేక్ జాఫర్, షేక్ నాయబ్, తదితరులు ఆ స్థలంలో తమకు పట్టాలిచ్చారు.. ఎంతో కొంత డబ్బు ఇస్తాం.. ఖాళీ చేయమని వేధిస్తున్నారన్నారు. ఈ నెల 22వ తేదీన ఓబయ్య, గంగయ్య తమ ఇంటి వద్ద లేని సమయంలో జేసీబీ తీసుకువచ్చి ఇళ్లు కూల్చివేశారన్నారు. తమకు అధికార పార్టీ నాయకుల అండ ఉందంటూ దళితులను భయభ్రాంతులకు గురిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కూల్చిన వారిపై కేసునమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు.

పోటీతత్వంతోనే లక్ష్య సాధన

సిద్దవటం : నేటి సమాజంలో లక్ష్యం సాధించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు పోటీతత్వం పెంపొందించుకోవాలని సిద్దవటం జెడ్పీహెచ్‌ఎస్ ప్రిన్సిపల్ శ్రీరాములు తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన క్విజ్ పోటీల్లో మొదటి బహుమతిని భాకరాపేట జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు రెడ్డి చెంద్రాయుడు, ప్రసన్న, అమూల్య, రెండవ బహుమతిని సిద్దవటం జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు లక్ష్మీ ప్రసన్న, గంగోత్రి, సాయి రిషిత గెలుచుకున్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వెంకట సుదర్శన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా నిర్మిస్తే ఉపేక్షించేది లేదు

నగర పాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి



నగరంలోని కంపోస్టు యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొడితే సహించబోమని కమిషనర్ మనోజ్‌రెడ్డి హెచ్చరించారు. కడప కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ భవనాలకున్న కొలతల కంటే తక్కువ వేసి, కమర్షియల్ ప్రాపర్టీని రెసిడెన్షియల్‌గా చూపి అక్రమాలకు పాల్పడిన ఇద్దరు అడ్మిన్ సెక్రటరీలు, ఒక ఇన్‌చార్జి ఆర్‌ఐని సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు. నగరంలో 4 వేల అసెస్‌మెంట్లకు పన్నులు పెరిగాయని, తమకు ఎక్కువ పన్ను వచ్చిందని ఎవరైనా భావిస్తే రివిజన్ పిటిషన్ పెట్టుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వాడినా, విక్రయించినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. చెత్త, చికెన్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేయరాదన్నారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చేలా ప్రజలు సహకరించాలన్నారు. అనుమతి లేకుండా నిర్మాణాలు జరిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో సమస్యలుంటే ప్రజలు కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చన్నారు. ప్రతి ఆదివారం రాజీవ్ పార్కు వద్ద సాంస్కృతిక, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఏడీపీ సర్వే ఇతర కార్పొరేషన్లలోనూ చేస్తున్నారని, డీకేటీ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి వారి పేర్లతో పన్ను వేయలేమని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

వర్మీ కంపోస్టు ఉచితంగా అందించాలి

తడి చెత్తను వర్మీ కంపోస్టుగా మార్చి రైతులకు ఉచితంగా అందించాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. స్థానిక జమాల్‌పల్లె వద్ద డంపింగ్ యార్డు, డాగ్ స్టెరిలైజేషన్ సెంటర్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డులో మంట పెడుతున్నవారి ఫొటోలు తీసి తహసీల్దారు, పోలీసు శాఖకు పంపాలన్నారు.

కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్, మెటీరియల్ రివకరీ ఫెసిలిటీ సెంటర్లను ఆయన పరిశీలించారు. వెయింగ్ బ్రిడ్జ్ వద్ద రోడ్డును పరిశీలించారు. సీసీ రోడ్డు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాల మల్లేశ్వర్, జి.శివకుమార్, రవీంద్రనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు



విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శనలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి ప్రభాకర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త జి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లెలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఊటుకూరు కేవీకే ఆధ్వర్యంలో శుక్రవారం రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ పరిశోధన స్థానం నుంచి యు.టి.ఆర్–181 వరి రకం విడుదలకు సిద్ధంగా ఉందని, ఇది అగ్గి తెగులు, గోధుమ దోమ, కాండం తొలిచే పురుగు, ఆకు ముడుత, ఉల్లికోడు పురుగు తక్కువగా ఆశించే రకమని అన్నారు. కేవీకే సమన్వయకర్త డా.వీరయ్య మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు మూడేళ్లుగా తరగతి గదిలో చదివిన అంశాలను ప్రత్యక్షంగా పొలాల్లో పరిశీలిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.వి.జయలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ సంస్థల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసి తమ ఉత్పత్తులకు మంచి ధర పొందాలని కోరారు. ఉద్యానశాస్త్రవేత్త డా.యస్.మానస మాట్లాడుతూ తమల పాకు, పసుపు పంటలలో ఎండు తెగులు నివారణకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు. అనంతరం రబీ పంటల యాజమాన్య విధానంపై రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు సమీకృత వ్యవసాయం, నేల, నీటి సంరక్షణ, సోలార్ ఫెన్సింగ్ అంశాలపై చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. డా.పి.వి.గీత శిరీష, డా.టి.మహేష్ బాబు, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. పోలీస్

శుక్రవారం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వార్షిక పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ పోటీలు -2024 అట్టహాసంగా జరిగాయి. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ప్రారంభించగా కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ స్థాయి వరకు ఉత్సాహంగా పాల్గొన్నారు. మిత్రులు క్రీడలు ఆడుతుండగా పోలీసులు ప్రోత్సహిస్తూ ఆనందంగా గడిపారు.

– రఫీ, సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్







మంచి నడవడికతోనే మెరుగైన ఆరోగ్యం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

కడప రూరల్: యువత మంచి నడవడిక అలవరుకుంటే.. ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని డాక్టర్ రబ్బాని అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఎయిడ్స్‌పై అవగాహనా కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలతో ఎయిడ్స్, తదితర వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జీకే యూత్ అధ్యక్షుడు ఖాదర్ బాషా, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ రబ్బానీ

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రధానోపాధ్యాయుడు దేవ సహాయం అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని రాయల్ రషీద్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా ఆధ్వర్యంలో కడప సీఎస్ఐ హైస్కూల్‌లో ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మాట్లాడుతూ మన విద్యార్థులు దీర్ఘకాలిక, ఇతర వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

వరి ధాన్యం.. ధర తగ్గుముఖం

కష్టాలకోర్చి పంట సాగు చేసిన రైతుకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ఈ ఏడాది కేసీ కాల్వ కింద వరి పంట సాగు చేసిన అన్నదాత.. నూర్పిడి చేసి ధాన్యం సిద్ధం చేశారు. వ్యాపారులు తక్కువ ధర చెబుతుండడంతో చివరికి నిరాశే మిగిలింది. దీంతో గోదాముల్లో నిల్వ ఉంచుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

- మైదుకూరు నియోజకవర్గంలో మమ్మురంగా వరి నూర్పిళ్లు
- ధాన్యం కొనేందుకు ఆసక్తి చూపని వ్యాపారులు, దళారులు



ఈ రైతు పేరు లింగారెడ్డి రామోహన్‌రెడ్డి. చాపాడు మండలం రాజువారిపేటలో ఐదెకరాల్లో ఎన్‌డీఎల్‌ఆర్ రకం వరి పంట సాగుచేశాడు. తన సొంత పొలం రెండెకరాలకు తోడు, మరో మూడెకరాలు కౌలుకు తీసుకున్నారు. ఎకరాకు 36 బస్తాల చొప్పున దిగుబడి వచ్చింది. గత ఏడాది పుట్టీ(8బస్తాలు) రూ.18 వేలకు విక్రయించాడు. ధాన్యం ఇలా ఆరబెట్టుకుంటున్నాడు. వ్యాపారులు కొనేందుకు రాకపోవడంతో దిగాలు చెందుతున్నాడు.



చాపాడు మండలం కుందూనది సమీపంలో వరి కోస్తున్న యంత్రం

చాపాడు : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే వర్షాలు పడటంతో శ్రీశైలం జలాశయంలో పుష్కలంగా నీరు చేరింది. దీంతో అధికారులు సకాలంలోనే కేసీ కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో మైదుకూరు నియోజకవర్గంలోని చాపాడు, దువ్వూరు, ఖాజీపేట, బ్రహ్మంగారిమఠం, మైదుకూరు, మండలాల్లో దాదాపు 28,700 ఎకరాలలో రైతులు వరి పంట సాగు చేశారు. వరి పైరును చీడపీడల నుంచి కాపాడుకోవడంతో ఎకరాకు 32 నుంచి 40 బస్తాల వరకూ దిగుబడులు వచ్చాయి. దీంతో అన్నదాత గత రెండు వారాలుగా పంట నూర్పిళ్లు ప్రారంభించారు.

ధర లేక.. దిగాలు

వరి పంట నూర్పిడి జరుగుతున్నా వ్యాపారులు ఆసక్తి కనబరచడం లేదు. గత ఏడాది వరి ధాన్యం పుట్టి(8 బస్తాలు) రూ.18 వేలు పలికింది. ఈ ఏడాది మాత్రం వ్యాపారులు రూ.12 వేలకు పుట్టీ ధాన్యం కావాలని అడుగుతున్నారు. రైతు కష్టపడి ఎకరా పొలంలో వరి సాగు చేసేందుకు రూ.35 వేలు ఖర్చవుతుంది. దీనికి అదనంగా కౌలు భూమికి రూ.10 వేలు చెల్లించాల్సిందే. గతేడాది దిగుబడులు తగ్గినా.. ఎకరా పంటపై రూ.25-30 వేల వరకూ రైతుకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది పెట్టుబడులు వచ్చినా చాలని కోరుకుంటుండగా ధాన్యం కొనేందుకు వ్యాపారులు, దళారులు ఆసక్తి చూపడం లేదు. ధర గిట్టుబాటు కాకపోవడంతో గోదాముల్లో నిల్వ చేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకుని ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మైదుకూరు నియోజకవర్గంలో వరి సాగు వివరాలివీ..

మండలం	వరి సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
మైదుకూరు	3000
చాపాడు	12000
దువ్వూరు	7500
ఖాజీపేట	4500
బ్రహ్మంగారిమఠం	1500

బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్ తొలగించండి

కడప జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ

ఒంటిమిట్ట : విద్యుత్ బకాయిలు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాలని కడప జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎస్.రమణ ఆదేశించారు. శుక్రవారం ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలలో జిల్లా విద్యుత్ శాఖ సూపరిటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ విద్యుత్ కార్యాలయాలను విద్యుత్ బిల్లుల వసూళ్లపై ఆకస్మికంగా తనిఖీ చేసి అధికారులు, సిబ్బంది సాధారణ విధులను పర్యవేక్షించారు. బకాయిల వసూళ్లపై సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ బకాయిలు అధిక మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని, సంస్థ నెలరోజుల ముందు విద్యుత్ కొనుగోలు చేసి వినియోగదారులకు సరఫరా చేసి మరొక నెలరోజులు గడువు ఇచ్చి బిల్లు కట్టమంటుందంటే మొత్తం రెండు నెలలు గడువును వినియోగదారులకు ఇస్తోందని, కావున విద్యుత్ బకాయిల వసూళ్లల్లో రాజీ వద్దని, విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

విద్యుత్ బకాయిలు చెల్లించని వారి విద్యుత్ కనెక్షన్లను తొలగించాలని ఆదేశించారు. విధులలో అలసత్వం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట ఏఈ ఉదయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కార్తీక్, విద్యుత్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.